క్లుప్తంగా

25 న యువ సంగీత సమ్మేళనం

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో 25 వ తేదీన సంగీత కళాశాలలో యువ సంగీత సమ్మేళనం నిర్వహిస్తునట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి సీవీ రావ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువ సంగీత కళాకారులు మనసిజ, శ్రీ కృష్ణ వయోలిన్ కచేరి నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రముఖ వీణా విద్వాంసురాలు సుశీలా గోపాలంను ఆత్మీయంగా సత్కరిస్తునట్లు తెలిపారు.

అయ్యప్పస్వాములకు అన్నప్రసాద వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో మంగళవారం కార్తీక మాసోత్సవాలలో భాగంగా సుమారు 300 మంది స్వాములకు అన్నప్రసాద వితరణ జరిగింది. తొలుత మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీర మోహన రావు స్వాములతో కలిసి బాబాకు విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ 42 రోజుల పాటు దాతల సహకారంతో అత్యంత నిష్ఠతో అయ్యప్పస్వాములు, భవానీలకు ప్రతీ రోజు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని స్వాములు, భవానీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ తోటివారికి సాయం చేయటం అలవాటుగా చేసుకోవాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి సూచించారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకుని దుర్గా పురం అంగన్‌వాడీ కేంద్రంలో డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన సీలింగ్ ఫ్యాన్‌లు పంపిణీ కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ సెంటర్‌లో అవసరమైన ఫ్యాన్‌లు, కుర్చీలు అందజేస్తున్న డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ సేవలు అభినందనీయం అని కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మ దేశం వసంత కుమార్,, కార్యదర్శి కొండాయగుంట రాము, సభ్యులు పోతుల విల్సన్ రాజు, పి.సాయి, ఎస్టీవీఆర్ నగర పాలక సంస్థ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం సూర్య ప్రభ, సరోజినీ, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్ బండి పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరికీ అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అంబేడ్కర్ కాలనీలో మంగళవారం కార్పొరేటర్ పెనుమత్స శిరీష, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం ఆధ్వర్యాన నిరుపేద మహిళకు టిఫిన్ బండి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని నిరుపేద మహిళ కలవకొల్లు దుర్గకు టిఫిన్ బండి అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కలవకొల్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, యర్రంశెట్టి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో సాయి విక్రమ్‌కు పతకం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కర్నూలు జిల్లా నంద్యాలలో ఎస్‌పీ గ్రౌండ్స్ లో నిర్వహించిన 67వ ఆంధ్ర ప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ పెన్సింగ్ అండర్ 17 బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో ఎస్టీవీఆర్ విద్యార్థి సత్తాచాటి బ్రాంజ్ మెడల్ సాధించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు నుంచి ఓలేటి వెంకట సాయి విక్రమ్ ఫెన్సింగ్ విభాగంలో ఉన్నతంగా ఆడి స్టేట్ చాంపియన్‌షిప్‌లో బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఓలేటి వెంకటసాయివిక్రమ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.సూర్యప్రభ, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ ఎస్‌వి శ్యాంప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు, గణిత ఉపాధ్యాయుడు పొడుగు శ్రీనివాసరావు సత్కరించారు. రాబోయే రోజులలో మరిన్ని ఉత్తమ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

పేదల ముఖ్యమంత్రి జగనన్న

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంక్షేమాభివృద్ధి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే మరలా ప్రజలు తమ సంపూర్ణ మద్దతు పలుకుతున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 29 వ డివిజన్ మధురానగర్ 209 వ వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయంలో సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారులతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మంచిని తెలియజేయడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటిని అమలు పరచని వైనాన్ని సైతం ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు. అన్ని సామాజిక వర్గాలకు న్యాయం తమ ప్రభుత్వంలోనే జరుగుతున్నట్లు వెల్లడించారు. మహిళా సాధికారతలో చేయూత, ఆసరా, అమ్మఒడి, సున్నావడ్డీ, మహిళల పేరు మీదే ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ తో పాటు విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన వంటివి గతంలో జరగలేదని గుర్తుచేశారు. ఏ పథకం ఎప్పుడు వస్తుందనేది ముందుగానే క్యాలెండర్ ప్రకటించి.. అవినీతి, వివక్షకు తావులేకుండా సంక్షేమం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని చెప్పారు. 209 వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా రూ.13 కోట్ల 18 లక్షల 27 వేల 8 రూపాయల మేలు చేకూర్చగా.. నాన్ డీబీటీ ద్వారా 8 కోట్ల 71 లక్షల 20 వేల 924 రూపాయలు.. మొత్తంగా 21 కోట్ల 89 వేల 47 వేల 932 రూపాయల లబ్ధి చేకూర్చినట్లు వెల్లడించారు. పేదల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇంఛార్జి కంభం కొండలరావు, నాయకులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం

సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 1 వ డివిజన్ షిరిడీ సాయి నగర్ 1వ వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ ఉద్దంటి సునీతతో కలిసి ఆయన పాల్గొన్నారు. 1వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా 11 కోట్ల 54 లక్షల 91 వేల 19 రూపాయల మేలు చేకూర్చగా.. నాన్ డీబీటీ ద్వారా 3 కోట్ల 91 లక్షల 10 వేల 8 రూపాయలు.. మొత్తంగా 15 కోట్ల 46 లక్షల వేయి 27 రూపాయల లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. ఈ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల కారణంగా 2022-23లో రాష్ట్రం 16.22 శాతం వృద్ధిని నమోదు చేసిందన్నారు. అటు సంక్షేమం, ఇటు అభివృద్ధిని రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్తున్న జగనన్నే మరోసారి ఆంధ్రప్రదేశ్ కి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, ఆళ్ల ప్రసాద్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

నెరవేరిన పేదల ఆశలు....

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే పేదల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాయని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ ఇందిరానాయక్‌నగర్లోని 241 వ వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం వద్ద లబ్ధిదారులకు అందిన జాబితాల బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ప్రజలను ఏవిధంగా మోసం చేసిందో గుర్తుంచుకోవాలని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు ఏవిధంగా ఇంటి వద్దకే అందుతున్నాయో బేరీజు వేసుకోవాలని సూచించారు. 241 వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా సుమారు రూ.5 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.2.89 కోట్లు, మొత్తంగా రూ.7.80 కోట్ల వరకూ లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, బెజ్జం రవికుమార్, అంజిబాబు, నాగుల్‌మీరా, నేరెళ్ల శివప్రసాద్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా మధురానగర్ సెక్షన్ ట్రెండ్‌సెట్ పార్క్, మధ్యకట్ట ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రెండ్‌సెట్ పార్క్, ట్రెండ్‌సెట్ క్లబ్, బుడమేరు మధ్య కట్ట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాయిమహేష్‌కు నగర బహిష్కరణ పొడిగింపు

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఉప్పుగల్ల సాయిమహేష్ అలియాస్ నాని నగర బహిష్కరణ పొడిగిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సాయి మహేష్ వివిధ నేరాలకు సంబంధించి అరెస్ట్ అయ్యి, జైలుకు వెళ్లి బయటకు వచ్చిన అనంతరం కూడా తన నేర ప్రవృత్తిని మార్చుకోకుండా శాంతి భద్రతలకు విఘాతం కలుగ జేస్తున్నందున సీపీ టీకే రాణా పోలీస్ కమిషనరేట్ పరిధి నుంచి బహిష్కరించటమైనది. నగరంలో సామాన్య ప్రజా జీవనానికి విఘాతం కల్పిస్తూ, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అక్రమ రవాణ చేయడం, గంజాయి సేవించి అల్లర్లకు పాల్పడుతున్నందున నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు సీపీ తెలిపారు.

ప్రజల ఆశీస్సులే జగనన్నకు కొండంత బలం

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు
- 58వ డివిజన్ 239వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహణ



ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులే కొండంత బలమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58 వ డివిజన్ 239 వ వార్డు సచివాలయ పరిధిలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. తోట వారి వీధిలో 140 గడపలను సందర్శించి పలు అపార్ట్‌మెంట్ల అసోసియేషన్ సభ్యులతో భేటీ అయ్యారు. వివిధ వర్గాల ప్రజల సలహాలు, అభిప్రాయాలు స్వీకరించారు. గత నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో గట్టి నమ్మకం ఏర్పడిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నగదు బదిలీలు గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేదని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా పలు కుటుంబాలకు మంజూరైన నూతన రేషన్ కార్డులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. గతంలో రేషన్ కార్డు పొందాలంటే ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని.. కానీ ఈ ప్రభుత్వంలో ప్రతి 6 నెలలకోసారి కొత్త కార్డులను మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు.

చంద్రబాబు క్షమాపణ చెప్పాలి....

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బెయిల్ వచ్చినంత మాత్రాన చంద్రబాబు నిర్దోషి అయిపోయారంటూ టీడీపీ ఎంపీ కనకమేడల విమర్శలు చేయడం అర్థరహితమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బెయిల్ వచ్చిన మాత్రాన చంద్రబాబు తప్పు చేయనట్టు కాదని, ప్రజాకోర్టులో ఆయన ఇంకా ముద్దాయేనని తెలిపారు. బాబుకు బెయిల్ రావడంపై హడావుడి చేస్తున్న ఎల్లో మీడియా.. కోర్టు చేసిన వ్యాఖ్యలను ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. స్కిల్ కేసును ఏదో కొట్టేసినట్లు ప్రజలకు తప్పుడు మెసేజ్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక అర్హత కనకమేడల, మిగతా పచ్చ నేతలకు ఏమాత్రం లేదన్నారు. షెల్ కంపెనీల పేరిట ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబుకు.. డీబీటీ ద్వారా పేదల ఖాతాలలో నేరుగా నగదును జమ చేస్తున్న సీఎం జగన్‌కు మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని తెలిపారు. కనుక అవినీతిపరులెవరో, మేలు చేసేదెవరో రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసని పేర్కొన్నారు. 2014-19 మధ్య వరుస కుంభకోణాలతో రాష్ట్రాన్ని అన్ని విధాలా భ్రష్టు పట్టించినందుకు ప్రజలకు ముందుగా చంద్రబాబు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కార్పొరేషన్ డీఈ గురునాథం, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, అంజిరెడ్డి, వసంత్, తోట వెంకటేశ్వరరావు, శర్మ, తోపుల వరలక్ష్మి, శోభన్, బొందిలి శైలజా, మహేశ్వరి, ఇతర నాయకులు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ కార్యాలయాల్లో దైనందిన విధులతోపాటు పచ్చదనం, పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు సూచించారు. మొక్కల పెంపకం, పరిసరాల శుభ్రత వంటి చర్యల్లో అధికారులు, సిబ్బంది భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌ను మోడరన్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది సహకారం అందించాలని కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కలెక్టరేట్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు తాము పనిచేసే కార్యాలయాల ఆవరణలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంటే మానసిక ప్రశాంతతో మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. కలెక్టరేట్‌లో పచ్చదనం పెంపొందించేందుకు చేపట్టిన చర్యలు అభినందనీయమని తెలిపారు. కార్యాలయాల్లో భవిష్యత్‌కు ఉపయోగపడే మొక్కలను నాటి, పెంచాలన్నారు. కనువిందు చేసే పూలమొక్కలతో పాటు రావి, వేప, టేకు, మామిడి, నేరేడు తదితర మొక్కలను నాటితే ఫలాలతో పాటు నీడనిచ్చేందుకు దోహదపడతాయన్నారు. కలెక్టరేట్‌లోని మరుగుదొడ్లను పరిశీలించారు. స్త్రీ, పురుషుల మరుగుదొడ్లు ప్రత్యేకంగా ఉండేలా తలపులకు ముందు అడ్డుగోడ నిర్మించాలని సూచించారు. ప్రైవసీ ఉండేలా చూడాలన్నారు. కలెక్టరేట్‌ను ఇతర కార్యాలయాలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్ ఆవరణ పరిశీలనలో కలెక్టర్ వెంట పరిపాలన అధికారి ఇంతియాజ్ పాషా, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, కలెక్టర్ వ్యక్తిగత కార్యదర్శి సతీష్ కుమార్ గార్డెన్ నిర్వాహకులు స్వామి, సిబ్బంది ఉన్నారు.

సింగ్‌నగర్‌లో ఓట్ల వెరిఫికేషన్ పరిశీలన



ఓట్ల వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఓట్ల వెరిఫికేషన్ ప్రక్రియను కార్పొరేషన్ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గ ఎన్నికల అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు నమోదు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పకుండా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. సింగ్‌నగర్ 59వ డివిజన్ పరిధిలోని రామానగర్ కాలనీలో ప్రజల సౌకర్యార్థం పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా కోరారు. రామానగర్‌కు విచ్చేసిన కమిషనర్‌ను కలుసుకున్న ఆయన ఓటు వెరిఫికేషన్ ప్రక్రియలతో తలెత్తుతున్న చిన్న చిన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వీటికి కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

3న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 2023-24విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్షను డిసెంబర్ మూడో తేదీన నిర్వహించినున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తెలిపారు. మూడో తేదీన ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. జాతీయ ఉపకారవేతన పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల హాల్ టిక్కెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్‌సైటు నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు తగిన చర్యలు తీసుకొని విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు అందే విధంగా చూడాలని సూచించారు.

ఆర్టీసీలో ఉద్యోగాలు ఇవ్వాలని వినతి



ధర్నా చౌక్‌లో ప్రదర్శన చేస్తున్న మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగులు, వారి పిల్లలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆర్టీసీలో పని చేస్తూ అనారోగ్య కారణాల రీత్యా మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని ఉద్యోగుల పిల్లలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో అన్‌ఫిట్ అయిన ఉద్యోగులు, వారి పిల్లలు ప్రదర్శన నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న వారు మాట్లాడుతూ మెడికల్ అన్‌ఫిట్ అయిన వారి పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జీవో విడుదల చేయడం జరిగిందన్నారు. అన్‌పిట్ అయిన వారిలో 40 మంది చనిపోయారన్నారు. మొత్తం 175 కుటుంబాలు ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగాలు కల్పించాలని వేడుకున్నారు. ప్రదర్శనలో అన్‌పిట్ ఉద్యోగుల పిల్లలు సుగుణకర్, నాగార్జున, విష్ణువర్ధన్ రెడ్డి, టీవీ రావు, సూర్య, దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించండి

జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారుల హక్కులపై అవగాహన, పరిరక్షణకు ఏటా డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని.. ఈ నేపథ్యంలో జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు, క్లబ్‌లు వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆ వివరాలను డిసెంబర్ 8వ తేదీలోగా తమ కార్యాలయంలో అందజేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వినియోగదారుల అవగాహనపై వీడియో, ఫొటోలతో పాటు సమగ్ర నివేదికను పంపితే వాటిలో ఉత్తమమైన మూడింటిని ఎంపిక చేస్తామన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం నాడు నిర్వహించే రాష్ట్ర స్థాయి వేడుకల్లో ఉత్తమమైన వాటిని పంపిన వారిని సత్కరిస్తామని పేర్కొన్నారు. పౌర సరఫరాల కమిషనర్ మార్గదర్శకాలకు అనుగుణంగా వినియోగదారుల రక్షణ చట్టం-2019పై షార్ట్‌ఫిల్మ్, ర్యాలీ, స్కిట్‌లు, ఇంటింటి ప్రచారం, ప్రదర్శనలు, ఎక్స్‌పో వంటివి నిర్వహించవచ్చన్నారు. వినియోగదారుల స్వచ్ఛంద సంస్థలు సొంతగా లేదా వినియోగదారుల క్లబ్‌ల విద్యార్థులతో కార్యక్రమాలు నిర్వహించవచ్చని.. అయితే ఎంఈవో, స్కూల్ హెడ్‌మాస్టర్ నుంచి అనుమతి పొందాలని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ అన్నారు.

కండ్రిక జంక్షన్ వద్ద కల్వర్టు



పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగర పాలక సంస్థ కండ్రిక జంక్షన్ వద్ద కల్వర్టు విస్తరణ పనులు నిర్వహిస్తోంది. అందులో భాగంగా నూజివీడు రోడ్డు నుంచి కండ్రిక కాలనీ వైపు వెళ్లే రోడ్డులో వాహనాల రాకపోకలతో ఇరుకుగా వుండటం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కల్వర్టు విస్తరణ పనులు చేస్తోంది. అక్కడ వున్న వాటర్ పైపులైను కల్వర్టు కింద భాగంలో ఉండే విధంగా మార్పు చేసినట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ తెలిపారు. రోడ్డులో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి పార్కు వైపు మరో రోడ్డును నిర్మించనున్నామని పేర్కొన్నారు. అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాలను కూడా మార్పు చేయాల్సి ఉంటుందన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు ఆలరించింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన ప్రణవం ఆర్ట్స్ అకాడమీకి చెందిన సీహెచ్ తాన్య, వర్ణిక, ప్రాజ్ఞవి, హిరణ్య, వెన్నెలతో పాటు పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు.

అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

దాసాంజనేయునికి సింధూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావటంతో పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

పోయినవి

బత్తు చంద్రశేఖర్ S/o. బాలకృష్ణమ నాయుడు, చుట్టుగుంట సెంటర్, విజయవాడ వీరికి సంబంధిం, డాక్యుమెంట్స్ నెం. 784/2000, 12223/1982 విజయవాడ కరెన్సీనగర్ జిరాక్స్ షాపు నుండి జిరాక్స్ తీసుకొని వస్తుండగా ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి. దొరికిన వారు క్రింది నెంబర్‌ను సంప్రదించి అంజేయగలరు. సెల్: 9246492183

ప్రమాదాల నివారణకు చర్యలు

డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్



మాట్లాడుతున్న డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో భద్రత చర్యలపై మంగళవారం డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ తన కార్యాలయంలో పలు బ్రాంచ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో చేపట్టిన భద్రత చర్యలు, రైళ్ల నిర్వహణ, సమయపాలన తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ట్రాక్‌ల స్క్రీనింగ్, లెవల్ క్రాసింగ్‌ల తొలగింపు, ట్రాక్‌ల పునరుద్ధరణ తదితర ముఖ్యమైన భద్రత అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్‌ల పని గంటల నియంత్రణపై పూర్తిగా పర్యవేక్షణ చేయాలని బ్రాంచ్ అధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణపై డివిజన్‌లో చేపట్టిన పది రోజుల పాటు ప్రత్యేక సెఫ్టీ డ్రైవ్‌లో గుర్తించిన లోపాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. డివిజన్‌లో చేపట్టిన రోలింగ్ బ్లాక్ కారిడార్ పనుల పురోగతిపై చర్చించారు. అదే విధంగా ఏసీ కోచ్‌లలో స్మోక్ డిటెక్షన్ సిస్టం, ప్యాంట్రీ, పవర్ కార్‌లలో సప్రెషన్ సిస్టమ్ , అన్ని కోచ్‌లలో అగ్ని ప్రమాద నివారణ లభ్యత తదితర అంశాలపై సమీక్షించారు. లోకో పైలట్‌ల శిక్షణ సమయంలో క్రమం తప్పకుండా భద్రతపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి సమయంలో రైళ్ల నిర్వహణ సమయంలో భద్రత అంశాలను క్షుణంగా పర్యవేక్షించాలని తెలిపారు. ఏడీఆర్‌ఎంలు డి.శ్రీనివాసరావు, ఎమ్.శ్రీకాంత్ పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడిపితే జైలుకే

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు ప్రతి వారం నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా విజయవాడ నగరంలో ఈ ఏడాది ఇప్పటి వరకు 1,326 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసులలో 376 మందికి జైలు శిక్ష విధించడంతో బాటు, ఒకొక్కరికి 10 వేల రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడ్డ వారిని న్యాయస్థానాల్లో హాజరుపర్చగా వారికి రూ. 1 కోటి 14 లక్షల 8 వేలు జరిమానాగా విధించాయన్నారు. ఈ కేసుల్లో పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దు చేయటానికి చట్ట పరంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇక మీదట ట్రాఫిక్ పోలీసులతో పాటుగా లా అండ్ ఆర్డర్ పోలీసులు కూడా డ్రంక్ అండ్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టనున్నట్లుగా ఆయన తెలిపారు.